సాక్షి సంగారెడ్డి

సోమవారం, 30, జూన్, 2025



పద్మ మృతికి కారణమెవరు?

పొడిచన్‌పల్లి వీఏఓ పద్మ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కుట్రదారులెవరు?

వివరాలు 8లో ▸



ప్రారంభం ఘనం..

హుస్నాబాద్–రామవరం రోడ్డును డబుల్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



అధ్వానంగా రోడ్లు

జహీరాబాద్ పురపాలిక పరిధిలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్డులో ఉన్న ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ...మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94901 29839 నంబర్ సంప్రదించాలని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'తపస్' జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోట సుధాకర్



జహీరాబాద్ టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోట సుధాకర్ నియమితులయ్యారు. తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ ఆదివారం జహీరాబాద్ పట్టణానికి వచ్చిన సందర్భంగా తపస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కోట సుధాకర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. తపస్ జిల్లా కార్యదర్శిగా నియమించడం పట్ల సుధాకర్ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ రఘునందన్‌రావుకు ఎమ్మెల్యే గూడెం పరామర్శ



ఎంపీ రఘునందన్‌రావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్ చెరు టౌన్: ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావును ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఎంపీ రఘునందన్‌రావును ఆదివారం పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి కృపతో త్వరిత గతిన కోలుకుని ప్రజాసేవలోకి రావాలని ఆకాంక్షించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన భేష్



ఉచిత వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. జహీరాబాద్‌లోని ప్రగతి నర్సింగ్ హోమ్, దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) వారి ఆధ్వర్యంలో మెడ్ బ్రిడ్జి స్వచ్ఛంద సంస్థ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామంతోపాటు ఇతర గ్రామాలకు చెందిన రోగులు తరలి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. 250 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరానికి జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల రోగులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారికి డీడీఎస్ సభ్యులు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో విక్రమ్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'ం ఎక్కడ?

- మూడు ప్రాంతాల్లో స్థలాలు పరిశీలన
- నివేదికలు సమర్పించిన అధికారులు
- ఫైనల్ చేయనున్న జేఎన్‌వీ
- తాత్కాలికంగా విద్యా సంవత్సరం ప్రారంభం

నారాయణఖేడ్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో జవహర్ నవోదయ విద్యాలయాలు (జేఎన్‌వీ) మంజూరు చేసింది. రాష్ట్రానికి 9 కొత్త విద్యాలయాలను గతేడాది మంజూరు చేయగా అందులో సంగారెడ్డి జిల్లాకు ఒక విద్యాలయాన్ని కేటాయించారు. జిల్లాకు కేటాయించిన విద్యాలయం ఏర్పాటు విషయంలో ప్రజాప్రతినిధులు తమ ప్రాంతంలో అంటే తమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిలో తమ తమ ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మారుమూల ప్రాంత విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండేందుకు కేటాయించిన విద్యాలయం మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని విద్యాభిమానులు, విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

తమ ప్రాంతాల కోసం నేతల పట్టు



నిజాంపేట్- బాచేపల్లి మార్గంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, రెవెన్యూ అధికారులు

అందోల్ కోసం మంత్రి.. పటన్‌చెరు కోసం ఎంపీ

ఆందోల్ నియోజకవర్గంలో నవోదయ ఏర్పాటు చేయాలన్న పట్టుతో మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నారు. ఆందోల్ శివారులో 20 ఎకరాల స్థలాన్ని సైతం అధికారులు పరిశీలించి నివేదిక సమర్పించారు. తన నియోజకవర్గంలోనే ఏర్పాటు చేయాలన్న పట్టుదలతో మంత్రి ఉన్నారు. కాగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయాలన్న యోచనతో ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. కేంద్రంలో ఉన్న ఢిల్లీ పెద్దల ద్వారా పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటుకు యత్నిస్తున్నారు. కాగా, అక్కడ కూడా అధికారులు స్థలాలను పరిశీలించారు. అమీన్‌పూర్ ప్రాంతంలో తగినంత స్థలం అందుబాటులో లేదని అధికారులు గుర్తించారు.

జేఎన్‌టీయూలో తరగతులు..

రాష్ట్రానికి మంజూరైన నవోదయ విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని యోచిస్తున్నారు. జూలై 14 నుంచి తరగతులు ప్రారంభించాలని ప్రణాళిక తయారు చేస్తున్నారు. జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయం తరగతులను తాత్కాలికంగా ఆందోల్‌లోని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేశారు. వచ్చేనెల రెండు లేదా మూడో వారంలో తరగతులను ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు పరిశీలించి గదులను సిద్ధం చేశారు.

నారాయణఖేడ్ కోసం ఎంపీ, ఎమ్మెల్యే ప్రయత్నాలు

మారుమూల ఖేడ్ నియోజకవర్గంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేస్తే మారుమూల పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి దామోదరలను సైతం కలిసి ఖేడ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. కాగా జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్ చౌదరిని కలిసి జిల్లాకు మంజూరైన నవోదయ విద్యాలయం మారుమూలన కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఖేడ్‌లో ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని కోరారు. అందుకు అనువైన స్థలం కూడా ఉన్నట్లు వివరించారు. అందుకు మంత్రి సైతం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ వెల్లడించారు. ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి, రెవెన్యూ అధికారులు ఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్–బాచేపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిపై ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. నవోదయ పాఠశాల ఏర్పాటుకు ఈ భూమి అనుకూలంగా ఉన్నట్లు అధికారులు నివేదిక సమర్పించారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి జయంత్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

తరగతులు ప్రారంభం..



జూలై రెండు లేదా మూడో వారంలో తరగతులు ప్రారంభిస్తున్నాం. ఆందోల్‌లోని జేఎన్‌టీయూలో తాత్కాలికంగా నవోదయ ఏర్పాటుకు భవనాలను పరిశీలించాం. ఈ విద్యా సంవత్సరం 6వ తరగతి ప్రారంభం అవుతుంది. నవోదయ ఎక్కడ నిర్మించాలనే అంశం జేఎన్‌వీ (జనవహార్ నవోదయ విద్యాలయం) బృందం నిర్ణయించాల్సి ఉంటుంది.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి,సంగారెడ్డి

ఆర్‌ఆర్‌తో ట్రాఫిక్ సమస్యలు దూరం

రింగ్ రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణం చుట్టూ లింకురోడ్లను కలుపుతూ నిర్మిస్తున్న రింగురోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు దూరమవుతాయని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారంశంకర్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పండరీరెడ్డి, అవుటి శంకర్, జానీపటేల్‌లతో కలిసి రింగురోడ్డు పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని రహదారిని విస్తరించడంతోపాటు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. పట్టణం చుట్టూ రోడ్ల నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్య తీరడంతోపాటు పట్టణం విస్తీర్ణం కూడా పెరిగనుందన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషిచేస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. నాయకులు కృష్ణ, దుర్గయ్య, తుకారాం, రాజేందర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.



రింగురోడ్డు పనులు పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

బీజేపీతోనే అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి పేర్కొన్నారు. రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం ప్రధాని మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్'కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలసి ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లేశ్, కిష్టన్న, లక్ష్మణ్‌గౌడ్, కృష్ణమూర్తి, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): వర్షాలు పడాలని సింగూర్ ప్రాజెక్టు సమీపంలో గ్రామస్తులంతా కలిసి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని బుస్సారెడ్డిపల్లి గ్రామస్తులు వర్షాలు పడాలని గ్రామంలో ఆయా దేవాలయాల్లో దేవతలకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు పెట్టారు. పంటలు మొలకెత్తి రోజులు గడుస్తున్నా వర్షాలు పడక పోవడంతో రైతులు ఆందోళన చెందిన గ్రామంలో దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ప్రారంభించారు. గంగమ్మకు నైవేద్యం పెట్టి గ్రామస్తులంతా అక్కడే భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

వానలు కురిపించు బీరప్పా!

నారాయణఖేడ్: వర్షాలు కురియాలని కోరుకుంటూ ఖేడ్ మండలం రుద్రారం గ్రామ రైతులు ఆదివారం బీరప్పదేవుడి పండగను ఘనంగా నిర్వహించారు. భజనలతో గ్రామం నుంచి గ్రామ శివారులోని బీరప్ప ఆలయానికి వెళ్లి స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు. వివిధ పార్టీల గ్రామనాయకులు ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి, సిందోల్ దశరథ్, రైతులు పాల్గొన్నారు.



సింగూర్ ప్రాజెక్టు సమీపంలో అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న బుస్సారెడ్డిపల్లి గ్రామస్తులు

శాకాంబరిగా దుర్గమ్మ





ఏడుపాయల్లో భక్తుల రద్దీ, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఆషాఢ మాసం మొదటి ఆదివారం పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గమ్మ భక్తులకు శాకాంబరి రూపంలో దర్శనమిచ్చింది. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

పాపన్నపేట(మెదక్)



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దామోదర

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

కార్యకర్త సురేశ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి దామోదర

వట్‌పల్లి(అందోల్): కాంగ్రెస్ కార్యకర్త తలారి సురేశ్ మరణం అతని కుటుంబానికే కాదు.. పార్టీకే తీరని లోటని, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సి. దామోదర రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని మేడికుందా గ్రామ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు తలారి సురేశ్ అనారోగ్యానికి గురై శనివారం మృతి చెందాడు. విషయం తెలిసిన మంత్రి ఆదివారం మృతుని ఇంటికి వెళ్లి సురేశ్ మృతిపట్ల నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని తల్లిదండ్రులు, భార్య పిల్లలను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నాగయ్య

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సమాజంలో దోపిడీ అణచివేత పోవాలన్నా, సమసమాజం రావాలన్నా అది కేవలం మార్కిస్ట్ సిద్ధాంతంతోనే సాధ్యమని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య స్పష్టం చేశారు. సంగారెడ్డిలో ఆదివారం కేవల్‌కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ...సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కులాల పేరిట, మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మల్లేశం, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న నాగయ్య

'మన్ కీ బాత్' వీక్షించిన మాజీ ఎంపీ బీబీపాటిల్

జహీరాబాద్ టౌన్: ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మాజీ ఎంపీ. బీబీపాటిల్ పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు. జహీరాబాద్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో 200 బూత్ లో 'మన్ కీ బాత్'ను చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన్ కీ బాత్'ద్వారా ప్రధాని మోదీ అనేక విషయాలను ప్రజల్లోకి తీసు కెళ్తున్నారని చెప్పారు.

మహిళా శక్తికి మోదీ కితాబు

నారాయణఖేడ్: 'మన్ కీబాత్ కార్యక్రమంలో తెలంగాణ మహిళా శక్తికి ప్రధాని మోదీ ప్రత్యేక కితాబునిచ్చారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప తెలిపారు. 'మన్‌కీ బాత్'123వ ఎపిసోడ్‌ను ఖేడ్‌లో ఆయన కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాచలంలో మహిళాగ్రూపు మిల్లెట్ బిస్కెట్ల తయారీ గురించి ప్రస్తావించారన్నారు.



మెరుగుబడినాయ్..

ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు

- కేంద్ర విద్యా శాఖ తాజా నివేదిక విడుదల
- రాష్ట్రంలో సంగారెడ్డికి 8వ, సిద్దిపేటకు 4, మెదక్‌కు 25వ ర్యాంక్



సిద్దిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల

ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరు గతంతో పోలిస్తే మెరుగుపడింది. కేంద్ర విద్యాశాఖ 2023–24 పెర్ఫార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్(పీజీఐ) నివేదికను ఇటీవల విడుదల చేసింది. దీని ప్రకారం 2022–23 కంటే పుంజుకున్నాయి. సర్కారు బడులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. దీంతో మెరుగుపడుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 3,105 ప్రభుత్వ పాఠశాలలో 1.80లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

– సాక్షి, సిద్దిపేట

అభ్యసన ఫలితాలు, చదువుల నాణ్యత, మౌలిక వసతులు, డిజిటల్ లెర్నింగ్, అందుబాటులో బడులు–పిల్లల రక్షణ, విద్యాపరిపాలన విభాగాల్లో 74 సూచికలను పరిగణనలోకి తీసుకుని 600 మార్కులకు గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో వచ్చిన మార్కుల ఆధారంగా 2023–24లో రాష్ట్రంలో సిద్దిపేట 276 మార్కులతో 4వ, సంగారెడ్డి 268 మార్కులతో 8వ, మెదక్ 244 మార్కులతో 25వ ర్యాంక్‌లు సాధించాయి. 2022–23లో ప్రశిష్ఠ మూడవ కేటగిరిలో ఉండగా 2023–24లో రెండవ కేటగిరిలోకి అప్‌గ్రేడ్ అయ్యాయి.

డిజిటల్ లెర్నింగ్‌లో వెనుకబాటు

డిజిటల్ లెర్నింగ్‌లో ప్రభుత్వ బడులు వెనుకబాటులో ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నాయి. పలు పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్నప్పటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. పలు పాఠశాలలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి బోధిస్తున్నారు. పాఠ్యంశాలు డిజిటల్ బోధన అందడం లేదు. సిద్దిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ బోధన అందిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు పలు పాఠ్యంశాలు క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయగానే కళ్ల ముందు కదలాడుతూ బోధిస్తుంది. ఇలా విద్యా వ్యవస్థల్లో మార్పులు తీసుకవస్తే మరింత మెరుగుపడే అవకాశాలున్నాయి. అభ్యసన ఫలితాలు గతంతో పోలిస్తే మెరుగుపడి సిద్దిపేట, సంగారెడ్డి వంద మార్కులు దాటాయి. మెదక్ జిల్లా వందలోపే మార్కులు వచ్చాయి.

బడులు అందుబాటులో లేక..

అందుబాటులో బడులు– పిల్లల రక్షణ విభాగంలోనూ ఉమ్మడి మెదక్ జిల్లా వెనుకబడ్డాయి. పలు చోట్ల ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో దాదాపు రెండు నుంచి ఐదు కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఆ కేటగిరిలో 35 మార్కులకు గాను మెదక్ జిల్లాకు 9, సిద్దిపేటకు 15, సంగారెడ్డికి 14 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ బడులను బలోపేతం చేయటంలో ఈ రెండు విభాగాలు కీలకమవటంతో వీటిల్లో మెరుగైన ఫలితాలు సాధించే విధంగా జిల్లా యంత్రాంగాలు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

2023-24లో మార్కులు ఇలా..

జిల్లా	అభ్యసన ఫలితాలు	చదువుల నాణ్యత	మౌలిక వసతులు	డిజిటల్ లెర్నింగ్	అందుబాటులో బడులు-పిల్లల రక్షణ	విద్యా పరిపాలన
మెదక్	97	43	29	10	09	56
సిద్దిపేట	110	51	29	16	15	55
సంగారెడ్డి	120	43	28	11	14	53

క్లుప్తంగా

భవనం పైనుంచి పడి మేస్త్రీ మృతి


ఆనంద్

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కింద పడి తాపీ మేస్త్రీ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మూసాయిపేటకు చెందిన కండ్లకోయ ఆనంద్(22) తాపీ పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో శనివారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా ఆదివారం మృతిచెందాడు. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుకర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి

శివ్వంపేట(నర్సాపూర్): చోరీకి పాల్పడిన వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని మగ్దుంపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ప్రశాంత్ ఆదివారం తెల్లవారుజామున ఇండ్ల ముందు నల్లాలకు బిగించిన మోటార్లతో పాటు కేబుల్ వైర్ల చోరీకి పాల్పడుతుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధరిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాన్స్‌ఫార్మర్

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైన ఘటన మండలంలోని ధరిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో ఈదురుగాలులు వీచడంతో పాటు స్వల్ప వర్షం మొదలైన కొద్దిసేపటికే ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు. సమీప నివాస గృహాల్లోని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. గ్రామస్తులు అప్రమత్తమై వెంటనే విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో సరఫరాను నిలిపివేశారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ దినకర్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైందని, సరఫరాకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నాయీ బ్రాహ్మణులు సంఘటితం కావాలి


సమావేశంలో నాయీ బ్రాహ్మణులు

సంగారెడ్డి: నాయీ బ్రాహ్మణులు సంఘటితమై ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని భారతీయ విద్యా మందిర్ స్కూలులో నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి అందరికీ ఆరోగ్యం, సౌందర్యాన్ని అందించిన ఘనత నాయీ బ్రాహ్మణులకు దక్కుతుందని గుర్తు చేశారు. అనంతరం నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో విషయ పరిజ్ఞానం కలిగిన వాడు నాయీ బ్రాహ్మణుడని అన్నారు. సుకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు నాగభూషణం, దత్తాత్రి, సత్యం, రాజారాం, కిరణ్, నర్సిహులు, రామ్ కిషన్, పట్టణ అధ్యక్షుడు మాణిక్ ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, కార్యదర్శి శ్రీశైలం, యువత కార్య దర్శి రాము, ఉపాధ్యక్షులు అనిల్ పాల్గొన్నారు.

పద్మ చావుకు కారణమెవరు?

నిధుల గోల్‌మాల్‌లో పాత్రదారులెవరో..

- దాదాపు రూ.85 లక్షల కుంభకోణం
- బయటకు రాని బ్యాంకు అధికారుల లీలలు
- బలవుతున్న అమాయకులు


పద్మ రాసిన సూసైడ్ లెటర్


పద్మ ఇంటికి వచ్చి అధికారులు న్యాయం చేయాలని కోరుతున్న సీఐటీయూ నాయకులు

పాపన్నపేట(మెదక్): 'వీఓఏ ఉద్యోగం చివరకు నా ప్రాణం మీదకు తెచ్చింది. బ్యాంకు, సెర్ప్ అధికారులు, తోటి ఉద్యోగులు కలిసి నా చావుకు కారణమయ్యారు. నా అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని, నా ద్వారా డబ్బులు తీసుకున్నారు. చివరకు నన్ను దోషిగా నిలబెట్టారు. ఇంత జరిగినా ఇంకా చచ్చిపోలేదా? అన్నట్లు కొందరు నిలదీస్తుంటే ఎలా బతకాలి. అందుకే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోతున్నా. కలెక్టర్ గారు నా చావుకు కారణమైన వారిని మాత్రం వదలొద్దు. విచారణ జరిపి, నిందితులను గుర్తించి, నా ఆత్మకు శాంతి కలిగించండి' అంటూ చివరిసారి లేఖ రాసి..ఉరి తాడుకు వేలాడింది.. పొడిచన్‌పల్లి వీఓఏ పద్మ.

కానరాని అధికారులు

పొడిచన్‌పల్లి వీఓఏ పద్మ ఆర్థిక నిందలు భరించలేక ఆత్మహత్య చేసుకొని 5 రోజులైంది. తనపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరపాలని చివరి కోరిక కోరుతూ.. లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. కానీ, ఇంత వరకు ఒక్క అధికారి కూడా కనీసం వారి ఇంటికి వచ్చి పరామర్శించిన పాపాన పోలేదు. 18 ఏళ్ల సేవ చేసినా కనీసం సానుభూతి కరువైంది. చివరకు వాట్సాప్ గ్రూపుల్లో సైతం ఆమె పేరును తొలగించి, జ్ఞాపకాలు సైతం చెరిపేశారని కొందరు తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

నిధుల గోల్‌మాల్‌లో పాత్రదారులెవరు!

పొడిచన్‌పల్లి గ్రామ సమాఖ్య పరిధిలో కొంత కాలం నుంచి జరిగిన సుమారు రూ.85 లక్షల కుంభకోణం రెండు నెలల క్రితం బయట పడింది. ఇందులో వీఓఏ పద్మతో పాటు బ్యాంకు అధికారులు, సెర్ప్ ఉద్యోగులు, సహచరుల పాత్ర ఉందన్న ఆరోపణలున్నాయి. కాగా తూతూ మంత్రంగా విచారణ జరిపిన అధికారులు సీసీని సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అయితే స్త్రీనిధి నుంచి నెలనెలా వస్తున్న రుణ రికవరీల డబ్బును కొంత మంది బ్యాంకు, సెర్ప్ అధికారులు వాడుకొని.. వాటిని చెల్లించడానికి డ్వాక్రా సంఘాల పేరిట సభ్యులకు తెలియకుండా రుణాలు తీసుకున్నారు. వాటిని పద్మ ద్వారా మళ్లించి, స్త్రీనిధికి జమ చేశారని పద్మ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అలాగే గ్రామ సంఘం నుంచి కూడా 18 చెక్కుల ద్వారా డబ్బులు డ్రా చేయించి పద్మను బలిచేశారని వాపోతున్నారు. అసలు డ్వాక్రా రుణాలు మొదట గ్రూపు ఖాతాలోకి, తర్వాత సభ్యుల బ్యాంకు ఖాతాలోకి వెళ్లాల్సి ఉండగా, అధికారుల ప్రమేయం లేకుండా పద్మ ఎలా కాజేస్తుందని ప్రశ్నిస్తున్నారు. అలాగే గ్రామ సంఘం నిధులు సైతం అధ్యక్షురాలు, కార్యదర్శి, కోశాధికారి సంతకాలు లేకుండా ఆమె ఎలా మళ్లించుకుంటుందని అడుగుతున్నారు.

పద్మ మరణానికి కారకులెవరు?

డ్వాక్రా సంఘాల నిధుల గోల్‌మాల్‌లో 'తిలాపాపం తలా పిడికెడు'అన్న చందంగా బ్యాంకు, సెర్ప్, తోటి ఉద్యోగుల పాత్ర ఉందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. నిధుల గోల్‌మాల్ బయటపడగానే అధికారులంతా పద్మను బాధ్యురాలిని చేస్తూ నిధుల రికవరీ కోసం ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. మరో వైపు కొంత మంది గ్రామస్తుల అవమానకర మాటలు, సంఘ సభ్యుల శాపనార్థాలు ఆమెను కుంగదీశాయని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. తన దగ్గర లేని డబ్బులు ఎలా చెల్లించాలనే ఆందోళన ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించాయని అంటున్నారు.

బాధ్యులను గుర్తించి శిక్షించాలి



అమ్మ చివరి కోరిక మేరకు డ్వాక్రా రుణాల గోల్‌మాల్‌పై పూర్తి స్థాయి నిష్పాక్షిక విచారణ జరపండి. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోండి. మాకు అప్పులు తప్ప ఆస్తులు లేవు. మా అమ్మ అన్ని డబ్బులు తీసుకుంటే మా భూములు ఎందుకు అమ్ముకుంటాం. పెంకుటింట్లో ఎందుకు నివసిస్తాం. మేము చదివింది సర్కార్ బడిలోనే. మా అమ్మ చనిపోయి 5 రోజులు అయ్యింది. కనీసం చివరి కోరికకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరం. పోయిన మా అమ్మను తెచ్చి ఇవ్వకున్నా, పోయిన పరువును కూడగట్టుకోవాలని పరితపిస్తున్నాం.

– నవీన్ రెడ్డి (మృతురాలి కొడుకు)


ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

భూ తగాదాలో స్నేహితుడి హత్య

- మరొకరికి తీవ్ర గాయాలు
- సంగారెడ్డి జిల్లాలో ఘటన


జైపాల్

కల్హేర్(నారాయణఖేడ్): భూ తగాదాలో స్నేహితుడు దారుణ హత్యకు గురయ్యాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్మ హన్మండ్లు, కుర్మ రమేష్ కుటుంబీకుల మధ్య దారి విషయంలో భూ తగాదా జరుగుతోంది. కొంత కాలంగా రెండు కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. భూ తగాదా విషయమై గ్రామంలో ఆదివారం ఉదయం పంచాయతీ జరిగింది. పంచాయతీలో సమస్య పరిష్కారం కాలేదు. మధ్యాహ్నం కుర్మ రమేష్, కర్పట్ల జైపాల్ కలిసి వ్యవసాయ భూమికి వెళ్లారు. రమేష్‌కు జైపాల్ సహకరిస్తున్నాడని ఇద్దరిని అంతం చేయాలని కుర్మ హన్మండ్లు కుటుంబీకులు పథకం రచించారు. అప్పటికే ఇద్దరి రాక కోసం మార్గమధ్యలో వేచిచేస్తున్నారు. ఇరువురి మధ్య మాటలతో గొడవ మొదలైంది. గొడ్డలి, మరణాయుధాలతో వారిద్దరిపై దాడి చేయగా దాడిలో జైపాల్ అక్కడికక్కడే చనిపోయాడు. రమేష్‌కు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, దుర్గ రెడ్డి, వెంకటేశం పరిశీలించారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. హత్యకు గల కారణాలపై లోతుగా దర్యాప్తు చేసేందుకు క్లూస్ టీంను రంగంలోకి దింపారు. మృతుడు జైపాల్ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

వ్యాన్ బోల్తాపడి కోళ్లు మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): కోళ్ల లోడ్‌తో వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. కాగా కోళ్లు మృతి చెందగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటన మండలంలోని 765డి జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు... కౌడిపల్లి నుంచి నర్సాపూర్ వైపు వెళుతున్న కోళ్ల వ్యాన్ అంతారం గేట్ సమీపంలో అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. వ్యాన్‌లోని కోళ్లు కిందపడగా సుమారు రూ 200పైగా మృతి చెందాయి. అనంతరం జేసీబీ సహాయంతో వ్యాన్‌ను లేపి తీసుకెళ్లారు.


బోల్తాపడిన కోళ్ల వ్యాన్

అల్లుడే తోసేశాడు!

- మృతురాలి తల్లి ఆరోపణ..
- పోలీసులకు ఫిర్యాదు

మెదక్‌జోన్ : తన బిడ్డ చావుకు అల్లుడే కారణమని అత్త ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఓ వ్యక్తి భార్యాపిల్లలతో కలిసి కోర్టుకు వచ్చి శనివారం రాత్రి భవనంపై నుంచి దూకిన విషయం విదితమే. అత్త, భార్యను సజీవదహనం చేసేందుకు వారు నిద్రిస్తున్న ఇంటికి నిప్పుపెట్టిన కేసులో కోర్టు చుట్టూ తిరుగుతూ, ఈ కేసులో నుంచి తనను కాపాడాలని కొంత కాలంగా భార్యపై ఒత్తిడి చేస్తున్నాడు నవీన్. ఆ కేసు విషయంలో కోర్టుకు హాజరైన నిందితుడు భార్య రమ్యతోపాటు మూడేళ్ల లోపు ఇద్దరు కూతుళ్లు రుచిక, యశ్వికలను కోర్టు భవనంపైకి తీసుకెళ్లి తోసివేసి, అతనూ జాగ్రత్తగా దూకాడని మృతురాలు తల్లి, రాజమణి పట్టణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

కేసు కొట్టి వేయించాలని..

హత్యాయత్నం కేసు రాజీపడటానికి వీలు ఉండదని, కోర్టులో సాక్షుల సమక్షంలో తేలుతుందని న్యాయవాదుల ద్వారా తెలుసుకున్న నవీన్ ఎలాగైనా భార్య, పిల్లలను చంపాలనే పన్నాగంతో కోర్టు భవనంపైకి తీసుకెళ్లాడని రమ్య తల్లి, బంధువులు ఆరోపిస్తున్నారు. పసిగట్టని రమ్య నవీన్ మాటలు నమ్మి భవనంపైకి వెళ్లిందని, చంపుతాడనే తెలిసి ఉంటే వెళ్లేది కాదని మృతురాలి బంధువులు పేర్కొంటున్నారు. ఒక్కసారిగా భార్యాపిల్లలను తోసి వేసే క్రమంలో పిల్లలిద్దరిని రమ్య అదిమిపట్టుకుని వారిని తన శరీరంపై వేసుకుని కిందపడటంతో దుర్మరణం చెందింది. పిల్లలకు గాయాలు అయినప్పటికీ ప్రాణాలతో బయట పడ్డారని పలువురు పేర్కొంటున్నారు.

కారు బోల్తా.. బాలిక మృతి


ప్రతిమ మృతదేహం


బోల్తా పడిన కారు

పాపన్నపేట(మెదక్): కారు బోల్తాపడి బాలిక మృతి చెందింది. ఈ ఘటన ఏడుపాయల ఆలయ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన కొత్తూరి ప్రతిమ (17)ఇంటర్ పూర్తి చేసింది. కొంత కాలంగా నగరంలోని ఫతేనగర్ ప్రాంతానికి చెందిన గొల్ల చింటూ (17) ప్రతిమను ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. ఈ విషయంలో ఇదివరకు రెండు , మూడు సార్లు ప్రతిమ కుటుంబీకులు అతన్ని మందలించారు. అయినా అతని తీరు మారలేదు. ఈ క్రమంలో శనివారం ప్రతిమ ఇంట్లో చెప్పకుండా చింటూతో వెళ్లింది. అతని స్నేహితులు మనోహర్, శివకుమార్‌తో కలిసి నలుగురు ఇన్నోవా కారులో ఏడుపాయలకు వచ్చారు. చింటూ కారు నడుపుతుండగా, ప్రతిమ, మనోహర్, శివకుమార్ వెనుక కూర్చున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో భోజనం చేయడానికి పోతంషెట్పల్లి వైపు వెళ్తుండగా, ఏడుపాయల బస్టాండ్ సమీపంలో అతివేగంగా వెళ్తూ, కారు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. అటుగా వెళ్లినవారు 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి ప్రతిమ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. చింటూ, మనోహర్, శివకుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా తమ కూతురి చావుకు చింటూనే కారణమని మృతురాలి తండ్రి అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురు పౌర్ణమి గోడపత్రిక ఆవిష్కరణ


గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నిర్వహించే గురు పౌర్ణమి వేడుకల గోడపత్రికను ఆదివారం ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి, అవధూత గిరి మహారాజ్, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జులై 4 నుంచి 10 వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాతశ్రీ అనసూయ మాత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు, నందిని మాత, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీకి రోడ్డు నిర్మించరూ?

నెలలు గడిచినా పూర్తి కాని పనులు


ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట పోసిన కంకర

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు కావడం ఈ విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతులిచ్చింది. కాలేజీ తరగతులను ఇప్పుడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రారంభించనున్నారు. 2017లో ప్రారంభమైన పాలిటెక్నిక్‌కు 2023 ఎన్నికల ముందు డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.90లక్షలను కలెక్టర్ మంజూరు చేసి టెండర్లు పిలిచారు. కానీ నిధులు లేకపోవడంతో కాంట్రాక్టర్ పనులు చేయడానికి ముందుకు రాలేదు. ప్రభుత్వం మారడంతో రోడ్డు మంజూరు పనులు మళ్లీ మొదటికీ వచ్చాయి. కాలేజీ ప్రిన్సిపాల్ విజ్ఞప్తి మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు కాలేజీ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్‌లో రూ.50లక్షల నిధులు మంజూరు చేయించారు. మార్చిలో కాలేజీ ముందు రెండు ట్రిప్పర్ల కంకర పోసిన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. పాలిటెక్నిక్ అడ్మిషన్లు, ఇంజినీరింగ్ అడ్మిషన్లు జరుగుతుండటంతో విద్యార్థుల సంఖ్య పెరగనుంది. కాలేజీ వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, లెక్చరర్లు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ప్రజాప్రతినిధికి బంధువు కావడంతో అధికారులు పనులు చేయాలని అడగడానికి వెనుకడుగు వేస్తున్నారు.

అడవి కాకర అధరహో

కిలో రూ.350 పలుకుతున్న వైనం


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న అడవి కాకరకాయలు

మెదక్ కలెక్టరేట్: ఎన్నో ఔషధ గుణాలున్న అడవి కాకరకాయ ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో అదరహో అనే స్థాయిలో ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఉన్న ధరను చూసి ప్రజలు అదిరిపోతున్నారు. మార్కెట్‌లో అప్పుడప్పుడు కనిపించే అడవి కాకరకాయలు చాలామందికి తెలియదు. రేటు ఎక్కువైతేనేం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాంటి కాకర ప్రస్తుతం మెదక్ మార్కెట్‌లో కిలో రూ.350 ధర పలుకుతోంది. దీంతో వాటిని కొనాలని ఆశ ఉన్నప్పటికీ చాలా మంది కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఇవి అటవీ ప్రాంతంలోనే పండుతాయి. కాబట్టే వీటికి అంత రేటు. ఆరోగ్యాన్నే కాదు మంచి రుచిని కలిగి ఉంటుంది. వీటిని అన్ని వయసుల వారు తినొచ్చు. వర్షాకాలంలో తింటే మరీ మంచిదని పెద్దలు చెబుతారు. వర్షాకాలంలో మొదలయ్యే జలుబు, దగ్గు, తుమ్ముల నుంచి రక్షిస్తుంది. కాకరతో బహుళప్రయోజనాలు ఉన్నాయి.

శంకుస్థాపన ఘనం.. పనులు శూన్యం


రామవరం గ్రామ రోడ్డు


మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

- హుస్నాబాద్- రామవరం డబుల్ రోడ్డుకు మోక్షమెప్పుడో
- రూ.25కోట్లు నిధులు మంజూరు
- కన్నెత్తి చూడనీ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు సింగిల్ రోడ్లు మాత్రమే ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ మల్లెచెట్టు చౌరస్తా నుంచి గౌరవెల్లి మీదుగా రామవరం గ్రామం వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జనవరిలో రామవరంలో శంకుస్థాపన చేశారు. ఈ డబుల్ రోడ్డు నిర్మాణానికి సుమారుగా రూ.25కోట్ల నిధులు మంజూరు చేశారు. కాగా శంకుస్థాపన చేసి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. అయితే హుస్నాబాద్ నుంచి రామవరం వరకు సుమారుగా 17కిలో మీటర్లు ఉంటుంది.

కొమురవెల్లి దేవస్థానానికి దారి

హుస్నాబాద్ మీదుగా గౌరవెల్లి గ్రామం నుంచి కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి రోజు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. సింగిల్ రోడ్డు మాత్రమే ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను పక్కకు తప్పించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గౌరవెల్లి గ్రామం రోడ్డంతా గుంతలమయంగా ఉంది. ఈ ఒక్క ఊరు దాటడానికే దాదాపు 20నిమిషాల సమయం పడుతుందని వాహనదారులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి త్వరగా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరగా ప్రారంభించాలి. కొమురవెల్లి దేవస్థానానికి ఈ రోడ్డు మార్గం లోనే వెళ్తుంటారు. రోజు వందల సంఖ్యలో వాహనాలు వెళ్లడంతో రద్దీగా ఉంటుంది. సింగిల్ రోడ్డు కావడంతో రాత్రి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు దృష్టి సారించి పనులు వెంటనే చేపట్టాలి.

– లింగాల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ, రామవరం గ్రామం

త్వరలో ప్రారంభిస్తాం

హుస్నాబాద్ మీదుగా రామవరం గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. ఇటీవల కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడినం. పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించాం. ఐదారు రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు చేపడతాం.

– రాహుల్, ఏఈ ఆర్అండ్‌బీ